తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
వరంగల్ - ఆదిలాబాద్
హన్మకొండ | జనగాం | ములుగు | నిర్మల్ | మంచిర్యాల
ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి | కొమురం భీం ఆసిఫాబాద్
మహబూబాబాద్
బుధవారం
06 నవంబర్ 2024
పేజీలు : 08
Follow :

## విద్యార్థి మృతి ఘటనపై
# కలెక్టర్ సీరియస్

- విధులలో నిర్లక్ష్యం వహించిన నలుగురు ఉద్యోగుల సస్పెన్షన్



**నిర్మల్ బ్యూరో, నవంబర్ 5 (జనంసాక్షి) :** మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి షేక్ అయాన్ మృతి చెందడం బాధాకరమని, ఘటనకు సంబంధించి నిర్లక్ష్యం వహించిన అధికారులను సస్పెండ్ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి షేక్ అయాన్ మృతి చెందడంతో ఘటనకు సంబంధించి ఆర్డీఓ రత్న కళ్యాణి ఆధ్వర్యంలో విచారణ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. విచారణ కమిటీ నివేదిక ఆధారంగా విధుల్లో నిర్లక్ష్యం వహించిన పాఠశాల ప్రిన్సిపల్ ఎం.సంతోష్, ఉపాధ్యాయుడు టి. రమేష్, పీఈటీ పెంటన్న, హెల్త్ సూపర్వైజర్ సుజాత లను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# సాయుధ పోరాటంతోనే భూపంపిణీ

- దున్నేవాడికే భూమి కమ్యూనిస్టు పార్టీ నినాదమే
- పోరాటయోధుడు, తెలంగాణ ముద్దుబిడ్డ నల్ల నరసింహులు
- దేహం ముక్కలైన దేశం ఒక్కటే అన్న నినాదమే కమ్యూనిస్టు పార్టీలది
- సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ




**పాలకుర్తి, నవంబరు 05 ( జనంసాక్షి) :** ప్రపంచం లోనే తెలంగాణ సాయుధ పోరాటానికి ప్రత్యేక గుర్తింపు ఉందని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ కార్యదర్శి కె. నారాయణ అన్నారు. మంగళవారం జనగామ జిల్లా, పాలకుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు నల్ల నర్సింహులు విగ్రహాన్ని నారాయణ ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 4 వేల మంది రైతులు. ప్రజలు అమరులయ్యారని గుర్తు చేశారు. భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం జరిగిన పోరాటం అజరామముని అన్నారు. నల్ల నర్సింహులు లాంటి యోధుడు తెలంగాణలో జన్మించడం ఈ ప్రాంతానికి గర్వకారణంగా అభివర్ణించారు, నల్ల నర్సింహులు రాసిన పుస్తకాన్ని తాను ఢిల్లీకి రైల్లో వెలుతున్న సందర్భంలో మెత్తం చదివినట్లు పేర్కొన్నారు. వచ్చే రెండేళ్లలో నల్ల నరసింహులు నక్షింపాలు వంద సంవత్సరాలు నిండుతాయని, ఇక్కడే ప్రజలందరు ఆయన శత జయంతి ఉత్సవాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. కేరళ, పశ్చిమ బెంగల్ లాంటి రాష్ట్రాల్లో భూమి కోసం భూస్వాములపై ప్రజలు తిరుగుబాటు చేశారని గుర్తు చేశారు. భారత దేశంలో 1920లో కమ్యూనిస్టు పార్టీ దున్నేవాడికే భూమి అనే నినాదం తీసుకువచ్చిందని గుర్తుచేశారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలు పోరాటం చేశారని అన్నారు. మాదేహం ముక్కలైన దేశాన్ని ముక్కలు కానివ్వం అని కమ్యూనిసులు పోరాడినట్లు తెలిపారు ప్రజా స్వాన్య వ్యవస్థ పరిషవిల్లాలంటే ప్రజలందరు ఒక్క తాటిపై నడవాలని సూచించారు. దేశంలో జమిలి ఎన్నికలు జరపించేలా బీజేపీ పార్టీ సిద్ధమవుతుందని అన్నారు. దానిని వ్యతిరేకిం చేందుకు ఇండియ కూటమితో కలిసి వామపక్ష పార్టీలు పని చేస్తాయని స్పష్టం చేశారు. ఈ రోజుల్లో ఒక పార్టీ నంచి గెలిచి మరోక పార్టీలోకి వెలుతున్న నాయకులు సిగ్గుపడాలని ఇదే పద్ధతి అని విమర్శించారు. అటువంటి ఎవరు పార్టీ మారిన రాజీనామా చేసి వెళ్లాలని సూచించారు. దేశంలో మెజానిటీ ప్రజలు ఐక్యంగా ఉండాలని ప్రధాని నరేంద్రమోది విలువునివ్వడం సిగ్గ చేటన్నారు. మాజీ మంత్రి దయాకర్రావు మాట్లాడుతూ నల్ల నర్సింహులు, కొండా లక్ష్మణ్బాపూజి విగ్రహాల ఏర్పాటుకు తాను సహకరించినట్లు తెలిపారు నల్ల నర్సింహులు చేసిన పోరాటం చాలా గొప్పదని అన్నారు. కవులకు పోరాట యోధులు పుట్టిన గడ్డ పాలకుర్తి గడ్డ అని గుర్తు చేశారు, పాలకుర్తి నియోజకవర్గంలో చాకలి ఐలమ్మ, దొడ్డి కొండయ్య, షేక బందగీ లాంటి పోరాట యోదులే కాకుండా కవులు బమ్మెర పోతన, పాల్కూరికి సోమనాధుడు వాల్మీకి లాంటి వారు. ఇక్కడే జన్మించినట్లు తెలిపారు తాను పాలకుర్తిని పర్యాటక రంగంగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. సీపీఐ జాతీయ నాయకుడు నారాయణ మంచి మిత్రుడని పాలకుర్తి రాబోయే రోజుల్లో పాలకుర్తి ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. నల్ల నర్సింహులు పోరాట స్పూర్తితో ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు, సీనియర్ జర్నలిస్టు పాశం యాదని మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను నల్ల నర్సింహులు.. పుచ్చలపల్లి సుందరయ్య లాంటి వారు రాశారని సాయుధ పోరాటం సమయంలో 150 మందిని చంపి మహిళలను అర్ధ నగ్నంగా బతకమ్మలాడించిన నీచ చరిత్ర ఈ ప్రాంత దేశ్ముట్లది నీచ చరిత్ర అన్నారు. నల్ల నర్సింహులు, నంద్యాల శ్రీనివాస్రెడ్డిలకు ఉరి శిక్ష వేసింది. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం కాదా అన్ని ప్రశ్నించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొని మరణించిన మిగతా 2లో..

# గిరిజన విద్యార్థులు అంతర్జాతీయ క్రీడల్లో రాణించాలి

- ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్



**ఖానాపూర్ నంబర్ 05 (జనంసాక్షి) :** గిరిజన విద్యార్థులు క్రీడారంగంలో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కెబి కాంప్లెక్స్ లో జరిగిన 5వ రాష్ట్రస్థాయి గిరిజన క్రీడోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మొదటగా ఎమ్మెల్యే బొజ్జు పటేల్, ఎంపీ గోడం నగేష్, బోథ్ శాసనసభ్యులు అనిల్ జాదవ్, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరి బాయి, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి ఖుష్బు గుప్తా, స్పోర్ట్స్ అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గిరిజన విద్యార్థులు చదువుతో పాటు క్రీడారంగంలో రాణించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల కోసం 320 కోట్లు కేటాయించిందన్నారు. అదేవిధంగా ప్రతి పాఠశాలను అభివృద్ధి పరచడానికి 25 వేల రూపాయల చొప్పున అందిస్తున్నామన్నారు. అలాగే ఆదర్శ పథకం ద్వారా పాఠశాలలను సుందరీకరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. స్పోర్ట్స్ పాఠశాలలను అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తామన్నారు. స్థానికంగా క్రీడాకారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# 2050- విజన్‌తో వరంగల్ మాస్టర్ ప్లాన్ సిద్ధం

- యుద్ధప్రాతిపదికన వరంగల్ ఎయిర్ పోర్ట్ పనులు
- వరంగల్ అభివృద్ధిపై విస్తృత స్థాయి సమావేశం
- వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- వరంగల్, హనుమకొండ జిల్లాల అభివృద్ధిపై సమావేశం





**వరంగల్ బ్యూరో, నవంబర్ 05 (జనం సాక్షి) :** గొప్ప చారిత్రిక నేపథ్యం ఉన్న వరంగల్ నగర అభివృద్ధికి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 2050 జనాభాను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన మాస్టర్ ప్లాన్ తుది దశకు చేరుకుందని త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మాస్టర్ ప్లాన్‌ను విడుదల చేస్తారని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాలు , వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి శ్రీపొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎమ్ .సి.హెచ్ .ఆర్.డీ లో వరంగల్, హన్మకొండ జిల్లాల అభివృద్ధి కార్యక్రమాలపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి , ఆయా జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన మాస్టర్ ప్లాన్ , వరంగల్ ఇన్నర్ రింగ్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్, భద్రకాళి టెంపుల్ అభివృద్ధి, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, మెగా టెక్స్‌టైల్ పార్క్, మామునూరు ఎయిర్‌పోర్ట్, ఎకో టూరిజం తదితర అంశాలపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్ నగరానికి ధీటుగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి పరచాలన్న కృతనిశ్చయంతో వరంగల్ నగర అభివృద్ధిపై గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిగతా 2లో..

# జనగామ జిల్లాలో బెల్ట్ బ్రాందీ షాపులను నివారించాలి

- నిబంధనలు పాటించని బ్రాండ్ షాపులు అనుమతులు రద్దు చేయాలి
- సిపిఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి



**జనగామ ప్రతినిధి, నవంబర్ 5(జనంసాక్షి ):** జిల్లాలో బెల్ట్ బ్రాండ్ షాపుల ద్వారా ఏరులై పారుతున్న మద్యాన్ని అరికట్టి ప్రజల ఆరోగ్యాన్ని ప్రజలు ప్రశాంతమైన జీవనం కొనసాగే విధంగా చర్యలు చేపట్టాలని సిపిఎం జనగామ జిల్లా కమిటీ కార్యదర్శి మోకు కనకారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈరోజు సిపిఎం జనగామ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషకు కలెక్టర్ కార్యాలయంలో మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు ఎక్సైజ్ స్టేషన్లో 48 లైసెన్సు వైన్ షాపులు ఉన్నాయని వీటి పరిధిలోని గ్రామాలలో జిల్లా మొత్తంలో వేలాదిగా బెల్ట్ బ్రాండ్ షాపులు బారు షాపులను తలపించే విధంగా ఉన్నాయన్నారు. గ్రామీణ ప్రాంతంలో పట్టణ ప్రాంతంలో ఏరులై పారుతున్న బెల్ట్ బ్రాందీ షాపుల వల్ల యువత కార్మికులు రైతులు వ్యవసాయ కార్మికులు అసంఘటిత కార్మికులు మద్యానికి బానిసలు అవుతున్నారని అప్పులు చేసి మరీ మద్యం తాగుతున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. తక్షణం బెల్ట్ షాపుల నివారణ చర్యలు చేపట్టడం కోసం రెవెన్యూ ఎక్సైజ్ డిపార్టుమెంటును సమన్వయం చేస్తూ టాస్క్ ఫోర్స్ ఏర్పాటుచేసి జిల్లాలోని వైన్ షాపులన్నీ తనిఖీలు నిర్వహించి నిబంధనలను పాటించడం వాటిపై చర్యలు తీసుకోవాలని అలాగే బెల్ట్ షాపుల నిర్వాహనకు ఉక్కు పాదం మోపాలని డిమాండ్ చేశారన్నారు. లేకుంటే సిపిఎం జిల్లాలోని ప్రజలందరి సమీకరించి దశలవారి ఉద్యమం చేపడతామని తెలిపారు. ఈకార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, సుంచు విజయేందర్, డివైఎఫ్ఐ నాయకులు కనుక చారి, ఎస్ఎఫ్ఐ నాయకులు యాకన్న తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు అసౌకర్యాలు కలగకూడదు

**డిపివో స్వరూప**

**లింగాల ఘణపురం, నవంబర్05(జనంసాక్షి):** శ్రీ వీరాచల జీడికంటి శ్రీ రామచంద్ర స్వామి దేవస్థానం జీడికల్ నందు ఈ నెల 14 గురువారం నుండి 27 బుధవారం వరకు నిర్వహించబడు బ్రహ్మోత్సవాలలో భాగంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా ఆలయ పరిసరాల పరిశుభ్రత,వాటర్ సప్లై,మొబైల్ టాయిలెట్స్ మొదలైన సౌకర్యాల ఏర్పాట్లను డిపివో స్వరూప,ఎంపీవో రఘురామకృష్ణ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఈఈ శ్రీకాంత్,ఆర్ డబ్ల్యూ ఎస్ డీఈ వేణుగోపాల్,ఆర్ డబ్ల్యూ ఎస్ ఏఈ రోహిణి,పీఎస్ మల్లేష్,ఆర్ డబ్ల్యూ ఎస్ ఏ ఈఈ శ్రీను,ఆలయ కార్యనిర్వహణాధికారి, అర్చకులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చిత్రలేఖనం పోటీలలో రాజోలు విద్యార్థులకు పతకాలు



**కురవి, నవంబర్ 05(జనం సాక్షి):** రంగోత్సవ్ సెలబ్రేషన్స్ 2024 ఆగస్టులో నిర్వహించినటువంటి నేషనల్ లెవెల్ కలరింగ్, హ్యాండ్ రైటింగ్, కార్టూన్ పోటీలలో రాజోలు హై స్కూల్ విద్యార్థులు 29 మంది పోటీలలో పాల్గొనగా అక్టోబరు 2024 ఫలితాలలో 18 మంది ఇంటర్నేషనల్ కాంపిటీషన్ కు ఎంపిక కావడం జరిగింది. వీరిలో ఆరుగురు బంగారు పతకాలు, ఆరుగురు వెండి పథకాలు, ఆరుగురు రజతం పతకాలు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ రవికుమార్ తెలిపారు ఈ సందర్భంగా విద్యార్థులను మరియు ఆర్ట్ టీచర్ వి. ప్రభాకర్ ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయుల బృందం అభినందించారు.

## ఎన్యూమరేటర్లకు సమగ్ర కుటుంబ సర్వే శిక్షణ

**నెక్కొండ, నవంబర్ 5 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని రైతు వేదికలో సమగ్ర కుటుంబ సర్వే చేయడానికి ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇచ్చారు. ఎన్యూమరేటర్ల గా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ సూపర్వైజర్లు, మండల స్థాయి అధికారులు, ఏ ఈ ఈ, ఏ పి యం ,ఏ వి ఓ, ఏ యస్ ఓ , ఎం పి ఓ ఎంఈఓ. ఎంపీడీవో పాల్గొన్నారు

### కోట గుళ్లు, ఆంజనేయస్వామి దేవాలయాల్లో
# ఘనంగా నాగుల చవితి వేడుకలు



**గణపురం,నవంబర్ 05(జనం సాక్షి):** కార్తీక మాస ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని గణపురం మండల కేంద్రంలోని కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లు, గణప సముద్రం కట్టపై కొలువైన దక్షిణముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో నాగేంద్ర స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల ప్రాంగణంలో ఉన్న నాగేంద్ర స్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి పుట్టలో పాలు పోసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా తులసి మారేడు ఉసిరి మేడి తెల్ల జిల్లేడు చెట్ల వద్ద కార్తీక దీపాలను వెలిగించారు. పూజా కార్యక్రమాల అనంతరం దక్షిణ ముఖ ఆంజనేయ స్వామి దేవాలయ అర్చకులు వేద పండితులు గోవర్ధన, వేణుగోపా లాచార్యులు, కోటగుళ్ళ అర్చకులు జూలపల్లి నాగరాజులు భక్తులకు ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలు అందజేశారు.

## రిటైర్మెంట్ ఈఈ భీంరావ్ చేసిన సేవలు మరువలేనివి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్

**నెరడిగొండ నవంబర్5(జనంసాక్షి) :** ఉట్నూర్ ఐటిడిఎ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ)గా 39ఏళ్ళు సుదీర్ఘ కాలం అంకిత భావంతో పనిచేసి సేవలు అందించి ఇటీవల పదవి విరమణ పొందిన రాథోడ్ భీంరావ్ ఈఈకి మంగళవారం రోజున బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ ఉట్నూర్ లో గల వారి నివాసంలో కలిసి పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజనులకు అందించిన సేవలు గొప్పవని,ఆయన చేసిన ఉత్తమ సేవలు మరచిపోలేనివని అన్నారు. ఆయన వెంట మాజీ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ ఇచ్చొడ మాజీ ఎంపిపి ప్రీతంరెడ్డి నెరడిగొండ మాజీ ఎంపిపి రాథోడ్ సజన్ దేవేందర్ రెడ్డి భీంరావ్ లింబాజి తదితరులు ఉన్నారు.

## 2050- విజన్‌తో వరంగల్ మాస్టర్ ప్లాన్ సిద్ధం

ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న వరంగల్ మాస్టర్ ప్లాన్‌ను తమ ప్రభుత్వం కొలిక్కి తీసుకువచ్చిందని అన్నారు. అభివృద్ధి పనుల వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ఇన్నర్ రింగ్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్‌కు అవసరమైన భూసేకరణను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 41 కిలోమీటర్ల పరిధి ఉన్న వరంగల్ ఔటర్ రింగ్ రోడ్డును మూడు దశల్లో చేపట్టాలని మొదటి దశలో 20 కిలో మీటర్లు, రెండవ దశలో 11 కిలోమీటర్లు, మూడవ దశలో 9 కిలోమీటర్లు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. హైదరాబాద్ మినహా రాష్ట్రంలో మరెక్కడా ఎయిర్‌పోర్ట్ లేదని వరంగల్ జిల్లాలో ఎయిర్ పోర్ట్ రాబోతోందని, వీలైనంత త్వరగా ఎయిర్‌పోర్ట్ పనులను ప్రారంభించి ఏడాదిలోపు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన కార్యాచరణను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. 382 ఎకరాల పరిధిలో ఉన్న చారిత్రాత్మకమైన భద్రకాళి చెరువులో పేరుకుపోయిన పూడికను తీయాలని , ఇందుకు సంబంధించిన పనులను రేపటినుంచే మొదలు పెట్టాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండ చెరువును ఖాళీ చేయాలని అధికారులకు సూచించారు . ఈ చెరువు 40 శాతం గుర్రపుడెక్కతో నిండిపోయిందన్నారు. మెగా టెక్స్ టైల్ పార్క్ లో ఏర్పాటు చేసిన కంపెనీలు తప్పనిసరిగా స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వరంగల్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులను వీలైనంత త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్య, శాసనసభ్యులు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కె.నాగరాజు, నాయిని రాజేందర్ , ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, సిఎం ప్రత్యేక కార్యదర్శి బి. అజిత్ రెడ్డి, ఎం.ఎ.యూ.డి. ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్, రోడ్లు , భవనాల కార్యదర్శి హరిచందన, హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు సత్యశారద, పి. ప్రావీణ్య తదితరులు పాల్గొన్నారు

## సాయుధ పోరాటంతోనే భూపంపిణీ

వీరులు ప్రపంచంలో మరెక్కడ ఇటువంటి ఉద్యమం జరగలేదని అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం కేంద్ర మంత్రి బండి సంజయ్కు ఏం తెలుసని ప్రశ్నిం చారు. సాయుధ పోరాట యోధుల విగ్రహాలను ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని, అదే విధంగా జయంతి, వర్ధంతిలను కూడా ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి సభ అధ్యక్షుడుగా మాచెర్ల సారయ్య, నల్ల నరసింహులు కూతురు అరుణ, సీపీఎం రాష్ట్ర నాయకుడు, మాజీ. ఎమ్మెల్యేలు రాజారెడ్డి, వన్నాల శ్రీరాములు, పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్కుమార్, అబ్బాస్, సింగారపు రమేష్, తెలంగాణ తల్లి ఐలమ్మ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి మంజుల, గుమ్మడి రాజుల సాంబయ్య, బైరుభార్గవ్, సుదర్శన్, మేడారపు సుధాకర్, కృపాకర్, పోగు శ్రీనివాస్, చిదురాల దనుంజయ, మాచర్ల పుల్లయ్య, ఉన్నారు.

## అలుగుబెల్లి నర్సిరెడ్డిని ఎమ్మెల్సీగా మరోసారి గెలిపించాలి

- టీ యస్ యూటీఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య



**మంగపేట నవంబర్ 05(జనంసాక్షి) :** ఉపాధ్యాయ సమస్యలతో పాటు విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో అలుపెరుగని కృషిచేసిన అలుగుబెల్లి నర్సిరెడ్డిని రాబోవు వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో మరోసారి గెలిపించుకోవాలని టి ఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కే జంగయ్య పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలానికి వచ్చిన ఆయన మండలంలోని రాజుపేట, తిమ్మంపేట,కమలాపురం జెడ్పీ పాఠశాలలతో పాటు బ్రాహ్మణపల్లి,చుంచుపల్లి, కోమటిపల్లి ఆశ్రమ పాఠశాలలు ప్రభుత్వ జూనియర్ కళాశాలను తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సంఘం ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా జంగయ్య ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా అలుగుబెల్లి నర్సిరెడ్డి నిత్యం ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం చేశారని,మండలంలో ఉపాధ్యాయ సమస్యలను లేవనేత్తి ఎన్నో సమస్యలకు పరిస్కారం చూపారని తెలిపారు. ఉపాధ్యాయలకోసం పరితపించే అలుగుబెల్లి నర్సిరెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం 317 జీవోకు సంబంధించి సబ్ కమిటీ ఇచ్చిన రిపోర్టును వెంటనే విడుదల చేసి బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలనీ కన్వెర్టెడ్ ఆశ్రమ ఉన్నత పాఠశాలకు పోస్టులు మంజూరు చేయాలనీ అలాగే పెండింగ్ లో ఉన్న డిఎ లు విడుదల చేయాలనీ ట్రెజరీలలో ఆమోదం పొంది పెండింగ్ లో ఉన్న బిల్లుల్ని క్లియర్ చేయడంతోపాటు కెజిబివి ఉపాధ్యాయులకు కనీసవేతనం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గొప్ప సమ్మారావు,ములుగు జిల్లా అధ్యక్షులు పోడెం సమ్మయ్య,జిల్లా కోశాధికారి ములుకాల వెంకటస్వామి, జిల్లా కార్యదర్శి కొండ చెంచయ్య, మంగపేట మండల అధ్యక్షకార్యదర్శులు గుండం పురుషోత్తం, జాటోతు సురేష్, ఉపాధ్యాయులు గడ్డి శ్రీనివాస్,గడ్డం శ్రీనివాస్, అల్లెం శ్రీనివాస్, నరేష్ లు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల సందర్శన

**చెన్నారావుపేట (జనంసాక్షి) :** ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించనున్న కొనుగోలు కేంద్రాలను నెక్కొండ సిఐ చంద్రమోహన్ సందర్శించి పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు. కోనాపురం, ఉప్పర పల్లి, చెన్నారావుపేట కొనుగోలు కేంద్రాలను పరిశీలిం చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజేష్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి

● మున్సిపల్, పీఆర్ అధికారులకు ఎమ్మెల్యే జీఎస్సార్ ఆదేశం..




**భూపాలపల్లి, నవంబర్ 5, (జనం సాక్షి) :** భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్ లో ఉన్నటువంటి అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మున్సిపల్, పీఆర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం ఎమ్మెల్యే స్థానిక కాంగ్రెస్ నేతలతో కలిసి భూపాలపల్లి బస్టాండ్ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. అంబేద్కర్ సెంటర్ నుండి బస్టాండ్, సుభాష్ కాలనీ మీదుగా జంగేడు వైపు రోడ్డు పనులు, డ్రైనేజీ పనులు ముందుకు సాగకపోవడంతో ఎమ్మెల్యే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేనికారణంగా మురుగు నీరు రోడ్డు వెంట పారడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఇట్టి సమస్యలను విన్న ఎమ్మెల్యే త్వరితగతిన పెండింగ్ లో ఉన్న రోడ్డు విస్తరణ, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మున్సిపల్ కమిషనర్, సిబ్బంది, పంచాయతీ రాజ్ అధికారులు, పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## రోడ్డుపై వేస్తున్న కంచెను అడ్డుకున్న రైతులు, నాయకులు

● చంద్రవెల్లి శివారులోని 146 సర్వే నెంబర్లు ఈ తంతు



**బెల్లంపల్లి, నవంబర్ 5, (జనంసాక్షి) :** బెల్లంపల్లి మండలంలోని చంద్రవెల్లి గ్రామపంచాయతీలో చంద్రవెల్లి నుండి గురజాల వెళ్లే రోడ్డుకు ఆనుకొని ఉన్న 146 సర్వేనెంబర్ భూమిని ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి కొనుగోలు చేసి, దానికి గతంలో ఉన్న కంచెను దాటి రోడ్డుపై నుండి కంచె వేస్తుండడంతో చంద్రవెల్లి నాయకులు చిలుముల శ్రీనివాస్, ఎండి రియాజ్, పూదరి గణేష్, గజెల్లి రాజకుమార్, రాసకొండ శంకర్, రైతులు పుదరి మల్లయ్య రైతులు గ్రామస్తులు రోడ్డుపై నుండి కంచె వేయడాన్ని ఆపారు. గ్రామస్తులు రెండు రోజుల క్రితం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో గిర్థవర్ వచ్చి వేస్తున్న కంచెను తీసివేసి రోడ్డుకు దూరంగా వేసుకోవాలని సూచించారని నాయకులు రైతులు తెలిపారు. అయినప్పటికీ మంగళవారం రోజున మళ్లీ కంచి వేయడానికి ప్రయత్నించడంతో వీళ్లు వెళ్లి అడ్డుకొని కంచె వేయకూడదని రియల్ ఎస్టేట్ వ్యాపారికి ఫోన్ ద్వారా తెలియజేయడంతో, అతను రాక అతని అనుచరులను పంపి ఇది వేస్తామని, అవసరమైతే మళ్లీ తొలగిస్తామని చెప్పడంతో ఈ కంచె వేయవద్దని రోడ్డుకు దాదాపు పది సీట్ల స్థలం ఉందని రోడ్డుని కబ్జా చేస్తే ఊరుకోమని చెప్పి పనులు ఆపించి వెళ్లిపోయారు. రెవెన్యూ అధికారులకు చెప్పినా కూడా పట్టించుకోవడంలేదని వారు వాపోయారు. ఎన్నో సంవత్సరాల నుండి ఉన్నటువంటి రోడ్డును ఆనుకొని సిమెంట్ ఫోల్లతో వేసే కంచెను ఆపి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రెవెన్యూ అధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## వరి కోత యంత్రాల ధరలపై కుదిరిన ఏకాభిప్రాయం



**నూగూర్ వెంకటాపురం నవంబర్ 5(జనంసాక్షి):** ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలో వరి కోత యంత్రాల ధరలు రైతులకు భారంగా ఉన్నాయని ఆదివాసీ నవ నిర్మాణ సేన అభ్యర్థన న మేరకు స్పందించిన తహసీల్దార్ లక్ష్మి రాజయ్య వరి కోత యంత్రాల యజమానులతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశం లో వరి కోత యజమానులతో టైర్ల మిషన్, చైన్ మిషన్ ధరల పైన సుధీర్ఘాంగా చర్చించి నట్లు తహసీల్దార్ రాజయ్య మీడియా కు తెలిపారు. ప్రస్తుతం తీసుకుంటున్న ధరలు రైతులకు పెను భారంగా ఉన్న నేపథ్యం లో రైతులకు అందుబాటులో ఉండేలా ధరలు నిర్ణయించారు. టైర్ల మిషన్ కు ఎకరానికి ప్రస్తుతం తీసుకుంటున్న 2600 వందల నుండి ఎకరానికి 2200 వందలకు , చైన్ మిషన్ కు ప్రస్తుతం గంటకు మూడు వేల ఐదు వందల తీసుకుంటున్న నేపథ్యం లో దాన్ని గంటకు 3000 వేల రూపాయలు తగ్గించి నిర్ణయించినట్టు తహసీల్దార్ తెలిపారు. రైతులకు భారం కాకుండా ధరలు నిర్ణయించినట్టు తహసీల్దార్ లక్ష్మి రాజయ్య పేర్కొన్నారు . రైతులను ధరల విషయం ఇబ్బంది పెట్టొద్దు అని వరి కోత యంత్రాల యజమానులకు సూచించారు. వరి కోత యంత్రాల ధరలు ప్రస్తుతం రైతులకు భారంగా ఉన్నాయి. తహసీల్దార్ లక్ష్మి రాజయ్య రైతులకు అందుబాటులో ఉండే విధంగా ధరలు నిర్ణయించి నందుకు రైతులు అందరికి న్యాయం జరిగింది అని అన్నారు. ఇందుకు కారణం అయిన తహసీల్దార్ లక్ష్మి రాజయ్య కు, ఆదివాసీ నవనిర్మాణ సేన సంఘానికి ధన్యవాదములు తెలిపారు.

## వ్యవసాయానికి అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

**నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి**

**సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి**



**బచ్చన్నపేట ( జనం సాక్షి) :** బచ్చన్నపేట మండల కేంద్రంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను నెలకొల్పి స్థానిక యువకులకు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సిపిఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం రోజున సిపిఎం పార్టీ బచ్చన్నపేట మండల 7వ మహాసభ పోచన్నపేట గ్రామంలో జరిగింది. మహాసభ ప్రారంభానికి ముందు పార్టీ పథకాన్ని జిల్లా కార్యదర్శి ఆవిష్కరించి మహాసభలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభకు మండల కమిటీ సభ్యులు తాడూరి వెంకటవ్వ, రావుల రవీందర్ రెడ్డి మిన్నలాపురం ఎల్లయ్య లు అధ్యక్ష వర్గంగా వ్యవహరించగా ముఖ్యఅతిథిగా కనకా రెడ్డి హాజరై మాట్లాడుతూ బచ్చన్నపేట మండలం దక్కన్ పీఠభూమికి అతి దగ్గరగా ఎత్తైన ప్రాంతంగా ఉన్నదని ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటిపోయి రైతుల పంటలు నష్టపోతున్నారని ఈ ప్రాంతంలో రిజర్వాయర్లు ఏర్పాటు చేసి చెరువులు కుంటలు నింపాలని వారు డిమాండ్ చేశారు. అలాగే బచ్చన్నపేట ప్రాంతంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను జ్యూస్ మిల్లులు కాటన్ మిల్లులు వరి పంటకు సంబంధించిన పరిశ్రమలను ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు విస్తరించాలి

**జనగామ ప్రతినిధి, జనంసాక్షి (జనంసాక్షి) :** ప్రొఫెసర్ జయంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏరువాక కేంద్రం, యాదాద్రి భువనగిరి జిల్లా వారి ఆధ్వర్యంలో రఘునాథపల్లి మండలంలోని కన్నాయిపల్లి గ్రామంలో కేంద్రీయ ప్రత్తి పరిశోధన సంస్థ ప్రాజెక్ట్ లో భాగంగా అధిక సాంద్రత పద్ధతిలో ప్రత్తి సాగు చేస్తున్న శేరి సోమిరెడ్డి చేనులో క్షేత్ర దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమములో, ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా.బి.అనిల్ కుమార్ మాట్లాడుతూ అధిక సాంద్రత ప్రత్తి సాగు విధానం మరియు ప్రాజెక్టు వివరాలను రైతులకు అందించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు, వసంత సుగుణ మాట్లాడుతూ అధిక సాంద్రత ప్రత్తి పంట కోత తరువాత ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని తద్వారా పంట మార్పిడి చేయడమే కాకుండా, అదనపు ఆదాయాన్ని పొందవచ్చునని వివరించారు. ఆ తరువాత వ్యవసాయ అధికారి శ్రీనివాస రెడ్డి ప్రత్తిలో వాడాల్సిన ఎరువులకు సంబంధించిన అంశాలను వివరించారు. ప్రైవేటు విత్తన సంస్థల ప్రతినిధులు– డాక్టర్ అన్వేష ( గర్డా కెమికల్స్), జగదీష్, సంపత్ (క్రిస్టల్ సీడ్స్) రైతులను ఉద్దేశించి మాట్లాడారు. తదుపరి అధిక సాంద్రత ప్రత్తి పంటను సందర్శించి పంటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో యంగ్ ప్రొఫెషనల్ వేణు, కన్నాయిపల్లి గ్రామ అభ్యుదయ రైతులు మంతపురి యాదగిరి, సోమి రెడ్డి, మదార్, బిక్షపతి, బొట్ల శ్రీ నివాస్, వెలిశాల అంజయ్య, గబ్బేట, బానాజిపేట గ్రామ రైతులు పాల్గొన్నారు.

## సెల్ ఫోన్ రికవరీలో భూపాలపల్లి నెంబర్ వన్...




**భూపాలపల్లి, నవంబర్ 5,( జనం సాక్షి) :** సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్ ఫోన్ల రికవరీలో ఉత్తమ ప్రతిభ, డీజీపీ నుంచి ప్రశంసా. దొంగిలించబడిన, పోగొట్టుకున్న సెల్ ఫోన్ల రికవరీ లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీసులు ఉత్తమ ప్రతిభ కనబరిచి తెలంగాణ రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ ఐపీఎస్ చేతుల మీదుగా మంగళవారం ప్రశంసా పత్రం అందుకున్నారు. జిల్లా పరిధిలో ఏప్రిల్–2023 నుండి అక్టోబర్ – 2024 వరకు జిల్లా వ్యాప్తంగా గా 484 సెల్ ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకొని సెల్ ఫోన్ యజమానులకు అందజేయడం జరిగింది. ఈ ప్రశంసా పత్రాన్ని డిజిపి భూపాలపల్లి జిల్లా సీఈఐఆర్ పోర్టల్ నోడల్ ఆఫీసర్, సీసీఎస్ ఇన్స్పెక్టర్ ఎన్. వెంకటేశ్వర్లుకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పి కిరణ్ ఖరే మాట్లాడుతూ సెల్ ఫోన్ దొంగతనాల నుండి విముక్తి కల్పించడానికై డిపార్ట్మెంట్ ఆఫ్ టెలీ–కమ్యూనికేషన్ సి.ఇ.ఈ.ఆర్ పోర్టల్ ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, ఈ పోర్టల్ ద్వారా మంచి ఫలితాలు రాబట్టడం జరుగుతుందన్నారు. ఎవరైన మొబైల్ పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన వెంటనే సి.ఇ.ఐ. ఆర్ పోర్టల్ **(%https://www.ceir.gov.in%)** నందు బ్లాక్ చేసి, సంబందిత పోలీసు స్టేషన్లో సమాచారం ఇవ్వాలని గారు ప్రజలకు సూచించారు.

## నేడు నీటి సరఫరా బంద్

**వరంగల్ ఎంజీఎం నవంబర్ 5 (జనంసాక్షి):** వరంగల్ పరిధి చార్ బౌలీ వాటర్ ట్యాంక్ యందు 450 ఎం ఎం డయా వాల్వు దెబ్బ తినడం వల్ల మరమత్తు పనులు కొనసాగుతున్నందున నేడు (బుధవారం) వాటర్ ట్యాంక్ పరిధిలోని ప్రాంతాలైన గిర్మాజి పేట మండి బజార్ నిజాంపుర రాధికా టాకీస్ గల్లీ లక్ష్మిపురం పాత కొత్త చార్ బౌలి ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదని కావున ప్రజలు ఇట్టి విషయాన్ని గమనించి సహకరించాలని బల్దియా ఈ ఈ శ్రీ రామోజు శ్రీనివాస్ తెలిపారు.

## రానున్నవి మన రోజులే..

● కార్యకర్తలకు సిరికొండ అభయం



**రేగొండ,నవంబర్ 05( జనం సాక్షి):** తెలంగాణ తొలి శాసనసభాపతి ప్రస్తుత రాష్ట్ర శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధు సూదనాచారి మంగళవారం మండలంలో సుడిగాలి పర్యటన చేశారు.మండలకేంద్రంలోని కందకట్ల సురేందర్ గత నెల రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఆయన ఆయన ఆరోగ్యపరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.తదుపరి దామరంచపల్లి గ్రామవాసి కొత్త అమృతమ్మ కొద్ది రోజుల క్రితం కాలం చెయ్యగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందించారు.అనంతరం కార్యకర్తలతో మాట్లాడుతూ గడిచినా గడ్డు కాలాన్ని దాటి మంచి రోజులు వచ్చే సమయం ఆసన్నమైందని,రానున్నవి మనరోజులేనని ఎవరూ కూడా అదిర్యపడద్దని కార్యకర్తల్లో ధైర్యం నింపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సదానందం,మాజీ పీఎసిఎస్ గోపు బిక్షపతి, సీనియర్ నాయకులు లెంకల రాజిరెడ్డి,నరసింగం, మాజీ సర్పంచ్ అన్నారపు రాజు,జూపాక నీలంబరం, మాజీ ఎంపీటీసీ రాజు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు కాళీ ప్రసాదరావు పరామర్శ

**పరకాల నవంబర్ 5 (జనం సాక్షి):** పరకాల నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే బిజెపి రాష్ట్ర నాయకులు డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు మంగళవారం రోజున పరకాల నియోజకవర్గం పరకాల పట్టణానికి చెందిన మొలుగురి శ్రీదేవి, పావు శెట్టి ఆగయ్య , ఎల్లంకి శోభారాణి లు ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతూ వారి కుటుంబ సభ్యులను ప్రమర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పరకాల పట్టణ అధ్యక్షులు మార్త బిక్షపతి హనంకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి 21 వార్డ్ కౌన్సిలర్ ఆర్పి జయంత్ లాల్, హనంకొండ జిల్లా ఎస్టీ ప్రధాన కార్యదర్శి పాలకుర్తి తిరుపతి, రాజభద్రయ్య, శారద, దగ్గు విజయేందర్ తదితరులు పాల్గొన్నారు.

# విశ్రాంత ఉపాధ్యాయుల విజ్ఞానాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



**వరంగల్ ఈస్ట్, నవంబర్ 05(జనం సాక్షి)** విశ్రాంత ఉపాధ్యాయుల సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎన్నారై బత్తుల గంగాధర్ , పరకాలకోర్టు మాజీ ఏ జి పి అడ్వకేట్ మెరుగు శ్రీనివాస్అన్నారు. నడికూడ మండలానికి చెందిన బత్తుల సత్యం వరంగల్ నగరంలో స్థిరపడినారు. ఆయన ఉద్యోగ విరమణ పొందారు స్వగ్రామం నడికూడ కు దీపావళి సందర్భంగా విచ్చేసిన సందర్భంగా ఎన్నారై గంగాధర్ బాలవీర్ కుటుంబ సభ్యులు ఆయనను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. గ్రామానికి చెందిన బాలవీర్ కుటుంబానికి చెందిన పలువురు ప్రభుత్వ ఉద్యోగంలో స్థిరపడ్డారు. బత్తుల వెంకటయ్య, పరమేశ్వర్, వైద్య శాఖలో బత్తుల రాజయ్య, సర్వే అండ్ ల్యాండ్ డిపార్ట్మెంట్లో విధులు నిర్వహించి పదవి విరమణ పొందారు. బత్తుల కట్టయ్య ఆర్ఎంపి వైద్యుడుగా వ్యాపారంగంలో స్థిరపడ్డారు. వారి కుటుంబ సభ్యులు బత్తుల మురళీధర్, రజిత,శ్రీధర్, భవాని ఉపాధ్యాయులుగా బత్తుల శ్రీధర్ విద్యుత్ శాఖ, ఏఈ, మౌనిక ఆర్ అండ్ బి డి ఈ గా కొనసాగుతున్నారు. పరకాలలో స్థిర పడ్డ మాజీ ఏజీ పి అడ్వకేట్ మెరుగు శ్రీనివాస్ గ్రామంలోని బాలవీరు కుటుంబానికి చెందినవారు. గ్రామానికి చెందిన పలువురు ప్రభుత్వ ఉద్యోగంలో స్థిరపడడం, మరికొందరు యూఎస్ఏ లో స్థిరపడడం గ్రామానికి గర్వకారణమని బత్తుల గంగాధర్ అన్నారు. సన్మాన కార్యక్రమంలో బత్తుల శ్రీనివాస్, రవీందర్ సాయి కృష్ణ, లోకేశ్వర్, భరత్ చంద్ర, రితీష్ చంద్ర మేరుగు వరుణ్, విశాల్, ప్రమీల, శ్రీలతపలువురు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కలిసిన బీసీ సంఘాల నేతలు

## బీసీల పక్షపాతిగా ఉంటానని హామీ



కాటారం నవంబర్ 5 జనం సాక్షిజయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం డివిజన్ కు చెందిన బీసీ సంఘ నేతలు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ను హైద్రాబాద్ లో కలిశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేయతలపెట్టిన బీసీ కులగణనలో తలెత్తే ఇబ్బందులను, బీసీ సమస్యలను మల్లన్న దృష్టికి తీసుకెళ్లారు. గతంలో అన్ని బీసీ సంఘాలు 'రెడ్డి గాండ్ల' కులస్థులు బీసీలు కాదని చేసిన పోరాటంలో భాగంగా, ఆనాటి ప్రభుత్వం వారు బీసీలు కాదని 2002 ఎన్ సీ బీ సి నం ఏ పీ 2002 , జీ ఓ నంబర్ 320/సి 2/2007 మరియు 2.8.2010 బీసీ కమిషన్ ఛైర్మెన్ జస్టిస్ దాల్వా సుబ్రమణ్యం ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారంగా రెడ్డి గాండ్ల కులస్థులు బీసీ లు కాదని, రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారని, వారికి బీసీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వద్దని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. గతంలో ప్రభుత్వం రద్దు చేసినప్పటికీ వారు ప్రస్తుతం జరుగుతున్న కులగణనలో మళ్ళీ బీసీలుగా గుర్తించబడాలనే ప్రయత్నం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్, వరంగల్, అదిలాబాద్ జిల్లాలో నివసిస్తున్న రెడ్డి గాండ్ల కులస్థులు బీసీలు కాదని అన్ని బీసీ కుల సంఘాలు ఐక్యతా రాగంతో ముందుకు వచ్చి చేస్తున్న పోరాటానికి బీసీ కులాల ఆపద్భాందవుడు, పేదల ఆశాజ్యోతి, పట్టభద్రుల శాసనమండలి సభ్యులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ను కలువడంతో అతను సానుకూలంగా స్పందించి, బీసీ కులాల పక్షపాతిగా న్యాయం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం కాటారం సబ్ డివిజన్ అధ్యక్షులు నిడిగొండ మైనర్ బాబు, కుమ్మరి సంఘం నాయకులు సముద్రాల తిరుపతి, నాయి బ్రాహ్మణ సంఘ నాయకులు విజయగిరి సమ్మయ్య, ముదిరాజ్ సంఘం నాయకులు గడ్డం స్వామి, యాదవ సంఘం నాయకులు ఆత్మకూరి స్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లో కొన్న ధాన్యాన్ని మిల్లులకు పంపించాలి

## రిహాబిలిటేషన్, రీ సెటిల్మెంట్ కమిషనర్ టి వినయ్ కృష్ణారెడ్డి



**ములుగు ప్రతినిధి,నవంబర్ 05(జనంసాక్షి ).**సరైన తేమ శాతం (17% కన్నా తక్కువ) తో కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని ఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమించబడిన రిహాబిలిటేషన్ అండ్ రీ సెటిల్మెంట్ కమిషనర్ టీ. వినయ్ క్రిష్ణారెడ్డి ఐఏఎస్ అన్నారు. మంగళవారం ఖరీఫ్ 2024 - 25 సీజన్ కి సంబంధించిన ధాన్యం కొనుగోలులో ఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమించబడిన టి వినయ్ కృష్ణారెడ్డి ములుగు జిల్లాలోని చాల్వాయి పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఏర్పాటు చేయవలసిన త్రాగు నీరు, టాయిలెట్లు మరియు ఇతర సదుపాయాలపై మరియు రైతుల నుండి ధాన్యం కొనుగోలు మరియు ధాన్యం డబ్బుల చెల్లింపులు మొదలైన వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. దొడ్డు రకం, సన్నరకం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యాన్ని గన్ని బ్యాగులలో తూకం వేసే కుప్పలన్నింటిని ఆరబెట్టి పంపించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు ప్రత్యేక అధికారి వినయ్ క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ... ధాన్యం కొనుగోలు కు సంబంధించి జిల్లా అధికారులకు పలు సలహాలు సూచనలు చేశారు. ధాన్యం కొనుగోలులో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులకు గురి చేయవద్దని ఎఫ్ ఏ క్యూ ప్రమాణాలను పాటించి ధాన్యం కొనుగోలు చేయాలని ధాన్యం కొనుగోలుకి సంబంధించి గన్ని బస్తాలు పంపించడం, ధాన్యాన్ని మిల్లులకు రవాణా చేయడం మరియు సన్న దాన్యానికి బోనస్ చెల్లింపులు మొదలగు చర్యల గురించి పలు సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని సూచించారు. అనంతరం జిల్లా కు విచ్చేసినఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమించబడిన రిహాబిలిటేషన్ అండ్ రీ సెటిల్మెంట్ కమిషనర్ టి వినయ్ క్రిష్ణారెడ్డి ఐఏఎస్ కు కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పూల మొక్కను అందచేసి స్వాగతం పలికారు. వారి తో సమావేశమై ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ధాన్యం అన్లోడ్ సమస్యలు, హమాలీలు, లారీల సమస్యల పై కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమములో ములుగు జిల్లా అడిషనల్ కలెక్టర్ రెవిన్యూ మహేందర్ జి, డిసిఎస్ఓ షా ఫైజుల్ హుస్సేనీ, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ రాం పతి, డిసిఓ సర్దార్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

# బచ్చన్నపేట బిఎస్పి మండల అధ్యక్షునిగా గంధమల్ల భాస్కర్



**బచ్చన్నపేట( జనం సాక్షి)** బహుజన సమాజ్వాది పార్టీ ( బి ఎస్ పి ) బచ్చన్నపేట మండల అధ్యక్షునిగా గంధమల్ల భాస్కర్ ఏకగ్రీవంగాఎన్నికయ్యారు. మంగళవారం మండల కేంద్రం లో బి .ఎస్.పి నియోజకవర్గ సమీక్ష సమావేశం జనగామ నియోజకవర్గ ఇన్చార్జి జేరిపోతుల మల్లేశం అధ్యక్షతన జరిగింది ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఈసీ నెంబర్ నిర్మల రత్నం హాజరు కాగా వారి ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా మల్యాల రమేష్. ప్రధాన కార్యదర్శిగా గొల్ల ఆనంద్. కార్యదర్శులుగా గంధ మల్ల చందు. తమ్మడి నవీన్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం రత్నం మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికలలో పార్టీ అన్ని స్థానాలలో పోటీ చేస్తుందని పార్టీ బలోపేతానికి అందరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు చిలుముల అర్జున్.తాండ్ర సిద్దులు. మహిళా నాయకురాలు గంధ మల్ల నవనీత. తాండ్ర లావణ్య. జోగు శివకుమార్. బొట్ల . నవీన్. గంధ మల్ల నర్సింలు. సంకటి బాల నరసయ్య తదితరులు ఉన్నారు

# ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని టీపియు ఎస్ నిరసన




**మహబూబాబాద్ బ్యూరో, నవంబర్ 05(జనం సాక్షి):**మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్ష చేపట్టారు. అనంతరం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి,రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని నినాదాలు చేశారు.ఈసందర్భంగా తెలంగాణ ఉపాధ్యాయ సంఘం నాయకులుటీఫ్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెండింగ్లో ఉన్న డి ఎ బకాయిలు, పెండింగ్ బిల్లులు, , పి ఆర్ సి అమలు చేస్తామని ప్రకటించిన నేటికి అమలు కాలేదని, 317 బాధితులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవనీ, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వారి యొక్క సొంత జిల్లాలకు వెళ్ళే విధంగా చూడాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్నీ కోరారు.గత కొన్ని పాఠశాల స్థాయి నుండి నిరసనలు చేస్తున్న ప్రభుత్వం చలించలేదని,రానున్న రోజుల్లో రాష్ట్ర స్థాయిలో ఉద్యమం చేపడతామని తెలిపారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో సూపరిండెంట్ కి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిబోయిన గోపికృష్ణ,జిల్లా ఉపాధ్యక్షులు వొామ సంతోష్, అమరగొండ మహేందర్, మండల రాజు, మేరుగు రమేష్, గుజరాతి శివకుమార్, కందగట్ల వెంకటేశ్వర్లు, తెమడ హరిబాబు, ఎనగాండ్ల నాగిరెడ్డి, జంపాల సోమయ్య పాల్గొన్నారు.

# కులగనన సర్వేకు మండల ప్రజలు సహకరించాలని

**జనం సాక్షి రఘునాథపల్లి నవంబర్05** ఈరోజు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవి గౌడ్ మాట్లాడుతూ రేపటి నుండి ప్రారంభమవుతున్న కులగనన సర్వేకు మండల ప్రజలు అధికారులకు ప్రభుత్వానికి సహకరించాలని ఆయన కోరారు. సంబంధిత అధికారులు వచ్చినప్పుడు ఆధార్ కార్డు నెంబర్లు, పట్టాదారు పాస్ బుక్ నెంబర్లు, వాహనాల నెంబర్లు, ఇంటి యొక్క డాక్యుమెంట్లు, దగ్గరగా ఉంచుకొని అడిగిన వివరాలు తెలియ జెసి అధికారులకు సహకరించాలని కోరారు

# మృతురాలి కుటుంబానికి బియ్యం అందజేత



**జనం సాక్షి,చెన్నారావుపేట** మండలములోని పాత మగ్దుంపురం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన మాదాసి కొమురమ్మ మృతి పట్ల కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు విచారణ వ్యక్తం చేశారు.అనంతరం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి 50 కిలోల బియ్యాన్ని అందజే శారు.ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు నన్మాస వీరస్వామి,మాజీ ఉప సర్పంచ్ నన్మాస కర్ణాకర్,మండల నాయకుడు పోలేపల్లి బిక్షపతి,బండారి సత్యం,శంకేసి రంజిత్, మాదాసి రమేష్,ఎస్, కే బోత్త,మైదం మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నాగుల చవితి వేడుకలు



**మంగపేట నవంబర్ 05(జనంసాక్షి)**మండల వ్యాప్తంగా మంగళవారం నాగులమ్మ దేవాలయాలలో నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.అదేవిధంగావాగోడ్డుగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో గల లక్ష్మీ నర్సాపూర్ గ్రామంలో వెలిసిన శ్రీ నాగులమ్మ అమ్మవారి ఆలయంలో నాగుల చవితి సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. మంగళవారం తెల్లవారు జాము నుండే భక్తులు ఆలయం వద్ద కు చేరుకొని శ్రీ నాగులమ్మ పుట్ట వద్ద ఆలయ ప్రాంగణంలో ఉన్న శివాలయంలో,కంకవనం పుట్ట కు పూజలు చేసి పిండి వంటలతో ప్రత్యేకంగా చేసిన ప్రసాదాలను,పండ్లను,పుష్పాలను సమర్పించి పుట్టలో పాలు పోసి దీపాలు వెలిగించి పూజలు చేశారు.అనంతరం శ్రీ నాగులమ్మ అమ్మవారిని దర్శించుకొనగా భక్తులకు ఆలయ ప్రధాన పూజారి బాడిశ రామకృష్ణ స్వామి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## ఆరె కులస్తులు కుల గణన లో ఆరే అని రాయాలి మండల అధ్యక్షుడు లోకటి నగేష్



**నడికుడ నవంబర్ 5 (జనం సాక్షి):–**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 6 వ తేదీ నుండి బీసీ కుల గణన చేపడుతున్న నేపథ్యంలో రాష్ట్రం లో ఆరె కులస్తులు అంద రూ జన గణన/ కులగణన లో లిఆరెలి అని వ్రాయిం చాలని నడి కూడ మండల అధ్యక్షుడు లోకటి నగేష్ సూచిం చారు.ఇది "బి సి –డి 34 కు సంబంధించినదని తెలిపారు. కొంతమంది ఓ బి సి కోసం కులగణన అనుకుంటున్నారని కానీ ఈ కులగణన అనేది ఓబీసీకి సంబంధించింది కాదని,స్థానిక సంస్థల ఎన్నికల కోసమే ఈ కులగణన అని తెలిపారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేయడం జరుగుతుంది కాబట్టి,దీన్ని ఆరె కులస్తులంతా గమనిం చాలని అన్నారు.ఎలాంటి సమస్యలు రాకుండా ఉండాలంటే అందరూ కూడా "ఆరె" అనే పదానికి కట్టుబడి ఉండాలని అన్నారు.ఈ విష యాన్ని గ్రామాల్లోని కిందిస్థాయి వరకు తీసుకువెళ్లాలని అన్నారు.ప్రతి ఒక్కరూ ఆరె అనే విష యాన్ని కులగణన లో రాయించాలని అన్నారు.సోషల్ మీడియాలో కూడా విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు.

## జిల్లాలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ అద్వైత కుమార్ సింగ్



**మహబూబాబాద్ బ్యూరో, నవంబర్ 05 (జనం సాక్షి):**జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ జిల్లాలో విస్తృతంగా పర్యటించారు.మరిపెడ మండలం చిల్లంచెర్ల, రాంపూర్, దంతాలపల్లి, పెద్దముప్పారం,పెద్ద వంగర, లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను, పెద్ద వంగర అంగన్వాడీ కేంద్రాల ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహించాలని, కేంద్రాలలో మౌలిక వసతులు త్రాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, సౌకర్యాలు కల్పించాలని, సన్నరకం, దొడ్డు రకం, కేంద్రాలలో రైతులకు పూర్తి అవగాహన కల్పిస్తూ కొనుగోలు చేపట్టాలని, రైతు యొక్క ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్, తదితర అంశాలను ఆన్లైన్లో వెంటనే నమోదు చేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు మ్యచ్చుర్, వచ్చే విధంగా ఎలా చర్యలు తీసుకోవాలో అవగాహన కల్పించాలన్నారు, ప్రభుత్వ సూచనల మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సెంటర్ నిర్వాహకులు నిర్వహించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు, రైస్ మిల్లర్లు సహకరించాలని, జిల్లా వ్యాప్తంగా (226) కేంద్రాలు కొనసాగుతున్నాయని, పెద్దవంగర అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేసి పిల్లలకు అందిస్తున్న పోషక ఆహార వివరాలు అడిగి తెలుసుకున్నారు. శ్యామ్, మ్యామ్ పిల్లల కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ మధుసూదన్ రాజు, డిసిఓ వెంకటేశ్వర్లు, డి ఎస్ ఓ ప్రేమ్ కుమార్, సెంటర్ నిర్వాహకులు సంబంధిత తహసీల్దారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ కాలనీ నూతన అభివృద్ధి కమిటీ ఎన్నిక





**వరంగల్ ఈస్ట్, నవంబర్ 05 (జనం సాక్షి)** గ్రేటర్ వరంగల్ 42వ డివిజన్ పరిధి రంగశాయిపేట తెలంగాణ కాలనీలో నూతన అభివృద్ధి మరియు సంక్షేమ కమిటీని కాలని వాసులందరు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో గత రెండేళ్లుగా ఉన్నటువంటి పాత కమిటీ ని రద్దు చేసి కొత్త కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. కమిటి గత అధ్యక్షుడు గంగిశెట్టి శ్రీనాథ్ ప్రతిపాదించిన నూతన కమిటీ సభ్యుల పేర్లను కాలనీవాసులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. అధ్యక్షుడిగా పెద్ది ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా గంగిశెట్టి శ్రీనాథ్, కోశాధికారిగా పెద్ది సాంబయ్య, ఉపాధ్యక్షులుగా ఏడుదొడ్ల నరేందర్ రెడ్డి, మడిపెద్ది ప్రభాకర్, సహాయ కార్యదర్శిగా పిల్లి రవి ప్రసాద్, గౌరవ అధ్యక్షులుగా సుంకరి రఘునందన్, ముఖ్య సలహాదారులుగా కేడల సునీల్, కొండే సుధాకర్, తుమ్మ ఉప్పలయ్య, గుగులోతు రాము, పోకల రామకృష్ణ, కన్నోజు సదానందం, కార్యవర్గ సభ్యులుగా సంపత్, వేణుగోపాల్, కిరణ్, రవీందర్, శశికాంత్, కిషన్, శివప్రసాద్, శ్రవణ్ కుమార్, కరుణాకర్, మహమూద్ పాషా లను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులందరూ ప్రమాణస్వీకారం గావించారు. ఈ సందర్భంగా పూర్వపు అధ్యక్షుడు గంగిశెట్టి శ్రీనాథ్ మాట్లాడుతూ గత కమిటీ హయాంలో తెలంగాణ కాలనీలో పూర్తిస్థాయిలో సిసి రోడ్లు, డ్రైనేజీ ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. పారిశుద్ధ, వీధి దీపాల నిర్వహణ ఎప్పటికప్పుడు చేపడుతూ కాలనీలో అభివృద్ధి కొరకు పాటుపడ్డామని తెలిపారు. నూతన అధ్యక్షుడు పెద్ది ఎల్లయ్య మాట్లాడుతూ కమిటీ సభ్యుల సహకారంతో కాలనీలో అపరిష్కృతంగా ఉన్న సమస్యల సాధనకు కృషి చేస్తానని తెలిపారు. తెలంగాణ కాలనీలో చాలా ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని కాలని అవుట్ లైన్ డ్రైనేజీ నిర్మాణానికి కమిటీ కృషి చేస్తుందని తెలిపారు. కాలనీ వాసులందరినీ కలుపుకొని ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా కాలనీ అభివృద్ధి కొరకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ కాలనీ పెద్దలు యువకులు మహిళలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కార్పోరేట్ శక్తులకు దేశాన్ని తాకట్టు పెట్టిన మోడీ ప్రభుత్వం

### సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్




**మహబూబాబాద్ బ్యూరో, నవంబర్ 05(జనం సాక్షి):** మహబూబాబాద్ పట్టణంలోని సిపిఎం పార్టీ ఒకటవ ఏరియా కమిటీ మహాసభ సమ్మెట రాజమౌళి, చాగంటి భాగ్యమ్మ, అధ్యక్షతన జరిగింది. ఈ మహ సభకు ముఖ్యఅతిథిగా సాదుల శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ ప్రజల సొమ్మును దేశ సంపదను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దోచుపెడుతుందని అన్నారు. పెట్టుబడిదారులకు అనుకూలమైన నిర్ణయాలు చేస్తూ పేదల పొట్టలు కొడుతుందని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్ అనుబంధ శక్తులు అధికారంలో ఉండడం వలన ఇతర మతాలపై మైనార్టీలపై రోజు రోజుకు దాడులు విపరీతంగా పెరుగుతున్నాయని విమర్శించారు. పెట్టుబడి దారి అనుకూల ఆర్థిక విధానాలను అమలుపరుస్తూ బీజేపీ దేశాన్ని అధోగతి పాలు చేస్తుందని అన్నారు. నిత్యవసర సరుకుల ధరలు పెంచి అదానికి మాత్రము రుణాలు మాఫీ చేసి వాళ్ల మెప్పు పొందారన్నారు. సాధారణ ప్రజల కోసం ఆత్మగౌరవం తల ఎత్తుకొని బతికే కోసం సిపిఎం పార్టీ ఈ కర్తవ్యాన్ని తీసుకొని పనిచేస్తుందని అన్నారు. శ్రమద్వారానే ఉత్పత్తి అవుతుంది శ్రమను గౌరవించాలి అనేది కమ్యూనిస్టు పార్టీ నినాదం అన్నారు. శ్రామికుడే అందరికన్నా గొప్పవాడు అన్నారు. ఇదే స్ఫూర్తి తోటి ఉద్యమించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సిపిఎం ఏరియా కమిటీ 11 మందితో ఎన్నుకోవడం జరిగిందని, కార్యదర్శిగా రావుల రాజును ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సుర్ణపు సోమయ్య, పట్టణ కార్యదర్శి భానోత్ సీతారాం నాయక్, చీపిరి యాకయ్య ,హేమ నాయక్, కుమ్మరికుంట్ల నాగన్న, గౌను వెంకన్న, తోట శ్రీనివాస్ ,వాంకుడోత్ రమాదేవి,ఎర్ర శ్రీనివాస్, పిఎన్ఎం జిల్లా కార్యదర్శి నక్క సైదులు పాల్గొన్నారు.

## నోటిఫికేషన్ పేరిట నిరుద్యోగులతో చెలగాటం

**బెల్లంపల్లి, నవంబర్ 5, (జనంసాక్షి )**రాష్ట్ర ప్రభుత్వం మరియు మహాసర్బ్ ఎంహెచ్ఎస్ఆర్బీ నోటిఫికేషన్ పేరిట నిరుద్యోగులతో చెలగాటం ఆడుతుందని నిరుద్యోగులు ఆరోపిస్తున్నారు. నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత సరైన ప్రిపరేషన్ సమయం ఇవ్వడం లేదన్నారు. నెలరోజులు సమయం మాత్రమే ఇచ్చారని, కనీసం రెండు నెలల సమయం ఇవ్వాలన్నారు. అప్లికేషన్ లో సరైన ఇన్స్ట్రక్షన్స్ ఇవ్వకుండా అభ్యర్థులను గందరగోళానికి గురి చేస్తున్నారన్నారు. వాస్తవానికి ఎక్స్పీరియన్స్ సర్టిఫికెట్ అడిగినప్పుడు ఏదైతే వర్కింగ్ ప్లేస్ ఉందో అక్కడ మాత్రమే ఎక్స్పీరియన్స్ సర్టిఫికెట్ అడగాలి కానీ హెడ్ ఆఫ్ ద సొసైటీ అడగడం, సొసైటీ అధికారి రిజెక్ట్ చేశారని అన్నారు. తద్వారా 20% వెయిటేజ్ మార్కులు అభ్యర్థులు కోల్పోతున్నారన్నారు. వర్క్ ఎక్స్పీరియన్స్ ఉన్నప్పటికీ కొంతమంది అభ్యర్థులు ఉన్నతాధికారుల అవగాహన లోపం వల్లనే ఇది జరిగిందన్నారు. దీని ద్వారా అభ్యర్థులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. గతంలో కూడా వర్క్ ప్లేస్ నుండి సర్టిఫికెట్ పెట్టినప్పటికీ రిజెక్ట్ చేశారన్నారు. దీని వల్ల కొంతమంది ఉద్యోగ అవకాశాన్ని కోల్పోయారని అన్నారు. ఇప్పటివరకు ల్యాబ్ టెక్నీషియన్ అభ్యర్థులకు ఎడిట్ ఆప్షన్ ఇవ్వలేదని, ఇతర నర్సింగ్ అభ్యర్థులకు మాత్రమే ఎడిట్ ఆప్షన్ ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే నోటిఫికేషన్ అయినప్పటికీ అప్లికేషన్ విధానంలో వేరియేషన్లు చూపెడుతూ సమస్యలకు గురి చేస్తున్నారని, ఈ నోటిఫికేషన్ కు సరైన ఈమెయిలు అడ్రస్ లేదని,నోటిఫికేషన్ సమస్యలను అందించడానికి టోల్ ఫ్రీ నెంబర్ కూడా పనిచేయడం లేదన్నారు. చాలాసార్లు ఈమెయిల్ అడ్రస్ కి ప్రస్తావనం పంపినామని, టోల్ ఫ్రీ నెంబర్ కి ఫోన్ కాల్స్ చేసినా ఎటువంటి ఉపయోగం లేదన్నారు. ప్రస్తుతం ఉన్నత అధికారుల పరిస్థితి ఇలా ఉందని అన్నారు. కనీస సమయం ప్రిపరేషన్ కి ఇవ్వాలని, వర్క్ ఎక్స్పీరియన్స్ ఉన్నప్పటికీ కొంతమంది సమయ భావం వలన సర్టిఫికెట్ అప్లోడ్ చేయలేకపోయారని, తప్పకుండా ఎడిట్ ఆప్షన్ ఇవ్వాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

## సీజనల్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి



**నెరడిగొండ నవంబర్5(జనంసాక్షి):**మీ చుట్టూ ఉన్న పరిసరాల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచి సీజనల్ వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు ప్రతిఒక్కరు అప్రమత్తంగా ఉండాలని హెచ్ఈఓ పవార్ రవీందర్ సూపర్వైజర్ సంతోష్ లు అన్నారు.మంగళవారం రోజున మండలంలోని గాజలి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు.ప్రభుత్వ ఆస్పత్రిలోనే నాణ్యమైన వైద్య సేవలు అందించడం జరువుతుందని అందుచేత హెల్త్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టె ంట్ సాయన్న అంగన్వాడీ టీచర్లు ఆశా వర్కర్ సిడం భానుప్రియ పాల్గొన్నారు.

# దేవాపూర్ రేంజ్ ను బెల్లంపల్లి అటవి డివిజన్ లో కలపాలి

**రెగ్యులర్ ఐఎఫ్ఎస్ అధికారిని నియమించాలి**
**కోనోకార్పస్ చెట్లను వెంటనే తొలగించాలి**
**ఎంసిపిఐ(యు)పార్టీ జిల్లా కమిటి డిమాండ్**



**బెల్లంపల్లి, నవంబర్ 5, (జనంసాక్షి )**బెల్లంపల్లి నియోజకవర్గంలో బెల్లంపల్లి అటవీ డివిజన్ ను ఆనుకొని ఉన్న దేవాపూర్ అటవీ రేంజ్ ను బెల్లంపల్లి డివిజన్ లో విలీనం చేయాలని, కోనోకార్పస్ మొక్కలను వెంటనే తొలగించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అటవిశాఖ కన్జర్వేటర్ శాంతారం, అటవిశాఖ జిల్లాకార్యాలయంలో సూపరింటెండెంట్ మల్లయ్యకు ఎంసిపిఐయు పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బెల్లంపల్లి అటవీ డివిజన్ రాష్ట్రం లోనే అన్నింటికన్నా పెద్ద డివిజన్ గా పేరు ఉండేదని, ఈ డివిజన్ లో తిర్యాని, బెల్లంపల్లి, కుష్ణపల్లి, రెబ్బెన, ఆసిఫాబాద్ రేంజ్ లు ఉండేవని అన్నారు. జిల్లాల విభజన లో భాగంగా బెల్లంపల్లి అటవీ డివిజన్ లో గల ఆసిఫాబాద్ , తిర్యాని, రెబ్బెన రేంజ్ లు ఆసిఫాబాద్ జిల్లా లోకి చేర్చారని, దీంతో బెల్లంపల్లి డివిజన్ లో నేడు బెల్లంపల్లి, కుష్ణపల్లి రేంజ్ లు మాత్రమే ఉన్నాయని అన్నారు. దీంతో ఈడివిజన్ ఉనికి ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. కొందరు అధికారులు కావాలని బెల్లంపల్లి అటవీ డివిజన్ ను ఎత్తివేసేందుకు కుట్రపూరితంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తమ పార్టీకి సమాచారం అందిందని అన్నారు. ప్రస్తుతం బెల్లంపల్లి డివిజన్ ను అనుకొని ఉన్న దేవపూర్ అటవీ రేంజ్ ఇక్కడకు 35 కిలోమీటర్ల దూరాన ఉన్న మంచిర్యాల అటవీ డివిజన్ లో ఉండడంతో వివిధ పనుల రీత్యా మంచిర్యాలకు అటవీ ఉద్యోగులు, సిబ్బంది వెళ్లాలంటే తీవ్ర ఆర్థిక వ్యయప్రయాసలతో పాటు సమయం కూడా వృధా అవుతుందని ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం వెంటనే స్పందించి బెల్లంపల్లి డివిజన్లో దేవపూర్ రేంజ్ ను విలీనం చేయాలని అన్నారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా పల్లె, పట్టణాల పచ్చదనం, సుందరీకరణ కోసం కోనో కార్పస్ మొక్కలను రోడ్లకు మధ్యలోని డివైడర్ లలో,పల్లె, ప్రకృతి వనాలలో, విద్యాలయాలలో తదితర స్థలాల్లో ఈ మొక్కలను నాటారని అన్నారు. వృక్ష శాస్త్రజ్ఞులు సైతం వీటివల్ల ఆస్తమా,చర్మ వ్యాధులతో పాటు ఇతర జబ్బులు వస్తాయని, భూగర్భ జలాలు కూడా అడుగంటుకు పోతాయని,ఇవి కొన్నిమీటర్ల లోతుకు వెళ్లడం వల్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజి, పైప్ లైన్, వైరింగ్ సిస్టంలు దెబ్బతింటాయని అన్నారు. విద్యాలయాల్లో వేలాది మంది విద్యార్థులు ఉంటారని, వెంటనే వీటిని తొలగించాలని, పైన పేర్కొన్న విషయాలలో స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంటనే స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. లేనట్లయితే ఎంసిపిఐయు పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోరాట కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు .

## క్రీడల్లో రాణించి యూనివర్సిటీకి పేరు తీసుకురావాలి

## కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రెటరీ వెంకయ్య



**వరంగల్ ఎంజీఎం నవంబర్ 5 (జనంసాక్షి):** సౌత్ జోన్ యూనివర్సిటీ లాన్ టెన్నిస్ పోటీల్లో రాణించి కాకతీయ యూనివర్సిటీకి పేరు తీసుకురావాలని కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రెటరీ డాక్టర్ వై.వెంకయ్య అన్నారు. మంగళవారం కిట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో అంతర్ కళాశాల కళాశాలల లాన్ టెన్నిస్ సెలక్షన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని వై వెంకయ్య మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ ఔత్సాహిక క్రీడాకారులు ప్రోత్సహిస్తుందని తెలిపారు. కాకతీయ యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు, కిట్స్ కళాశాల అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ యూనివర్సిటీ నుంచి పలువురు క్రీడాకారులు జాతీయ, సౌత్ జోన్, ఆల్ ఇండియా యూనివర్సిటీ పోటీల్లో రాణించారని తెలిపారు. ప్రతిభగల క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని గుర్తు చేశారు. కిట్స్ కళాశాల స్పోర్ట్స్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఈ లాన్ టెన్నిస్ పోటీలకు అద్భుత స్పందన ఉందని తెలిపారు. కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని వివిధ కళాశాలల పురుషుల, మహిళల విభాగంలో నుంచి దాదాపు 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఇందులో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఎంపిక చేసి సౌత్ జోన్ పోటీలకు పంపుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అబ్జర్వర్లు వెంకటస్వామి, అఫ్జల్, కిషన్, పవన్, ఫిజికల్ డైరెక్టర్లు ప్రభాకర్ గౌడ్, కుమార్, శ్రీధర్, పెరుమాండ్ల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటి సర్వేకు ప్రతి ఒక్కరు సహకరించాలి

## మున్సిపల్ చైర్మన్ అనిత రామకృష్ణ



**పరకాల(రూరల్) నవంబర్ 5 (జనం సాక్షి):**-పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశాను సారంపరకాల మున్సిపల్ పరిధి లోని 6వ, 7వ, 20వ వార్డులలో ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల జనగణ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ప్రతి ఒక్కరు సహకరించి విజయవంతం చేయవలసిందిగా పరకాల మున్సిపల్ చైర్మన్ సోదా అనిత రామకృష్ణ కోరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమం చరిత్రలో నిలిచిపో తుందని ప్రజలందరికీ సమాన హక్కులను అందేటట్టుగా ప్రభుత్వ పథకాలు అందరికీ అందేటట్లుగా ఈ కార్యక్రమం తోడ్పడుతుందని ,ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని అన్నారు .ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పార్టీ నాయకులు పార్టీ కార్యకర్తలు, అభిమానులు, వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

## నూతన డిఎంహెచ్ఓ గా అప్పయ్య



**ధర్మసాగర్ నవంబర్ 5 (జనం సాక్షి)** హనుమకొండ జిల్లా నూతన డి ఎం.హెచ్.ఓ గా బాధ్యతలు చేపట్టిన అప్పయ్య ఈరోజు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరియు ముప్పారం ఆయుష్మాన్ ఆరోగ్యం మందిరం స్పందించారు అనంతరం వారు మాట్లాడుతూ మండలం మరియు గ్రామాల ప్రజలకు ఎల్లప్పుడూ నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన శాస్త్ర చికిత్సలు అందించాలని అన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక వైద్య అధికారి డాక్టర్ ఎస్ గోపీనాథ్ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ఆర్ జగదీశ్వర్ ప్రసాద్ మరియు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్యాధికారు డి మహేందర్ డాక్టర్ అలేఖ్య భారతి కవిత శ్వేత రుచిత గీత టి ఎస్ ఎం ఎస్ ఐ డి సి ఏ ఈ రాధా కిషన్ డి ఈ ఎం ఓ అశోక్ రెడ్డి సిహెచ్ఓ నెహ్రూచంద్ సూపర్వైజర్ రామ్మోహన్ రావు సులోచన ప్రసన్నకుమారి సీనియర్ అసిస్టెంట్ రాధిక మరియు వైద్య సిబ్బంది ఆశ వర్కర్లు పాల్గొన్నారు

# లైసెన్స్ లేని కొనుగోలు దారులపై చర్యలు తీసుకోవాలి




**గంగారం నవంబర్ 5 (జనం సాక్షి** ఏజెన్సీ ప్రాతలైన గంగారం, కొత్తగూడ మండలలో రైతాంగం పండించిన మొక్కజొన్న, వరి,పత్తి తదితర పంటలను కొనుగోలు చేస్తున్న వ్యాపారస్తులలో లైసెన్స్ లేని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపందా) గంగారం,కొత్తగూడెం సంయుక్త మండల కార్యదర్శి పూనం ప్రభాకర్ ఒక ప్రకటనలో అన్నారు.కొందరు వ్యాపారస్తులు ఈ ప్రాంతంలోని అమాయక ఆదివాసి, గిరిజన, తదితర ప్రజల ను రకరకాల రూపాలలో మోసం చేస్తూ కొనుగోలు చేస్తున్నారని అన్నారు.ప్రభుత్వం నియమించిన నిబంధనల మేరకు లైసెన్సు లేని వ్యాపారస్తులపై రెవిన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ప్రకటనలో కోరారు.అనేక గ్రామాలలో ముందస్తు పెట్టుబడులకు సహాయం అనే పేరుతో ఇష్టానుసారంగా అధిక వడ్డీ వేస్తు రైతుకు నష్టం కలిగే విధంగా చేస్తున్నారని అన్నారు. నేడు మొక్కజొన్నల సీజన్లో అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేస్తూ రైతాంగానికి తగు సలహాలు సూచనలు ఇస్తూ రైతులు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.ఏజెన్సీ మండలాలలో వ్యవసాయ కొనుగోలు మార్కెట్ ఉపకేంద్రాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని ఆయన తెలిపారు. ఏజెన్సీరైతుకు నష్టం రాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే ఉద్యమాలు తప్పవని ఆ ప్రకటనలో ఆయన తెలిపారు. ప్రజల అవసరాలను బలహీనతను సొమ్ము చేసుకుంటు కోట్లకు పడగెత్తుతున్న నకిలీ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని లేదంటే ఆందోళన చేయక తప్పదని ప్రభాకర్ హెచ్చరించారు.....

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కుల గణన పై అవగాహన కార్యక్రమం



**పరకాల నవంబర్ 5 (జనం సాక్షి):**పరకాల శాసనసభ్యులు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశాల మేరకు పరకాల పట్టణంలోని 3వ డివిజన్ కౌన్సిలర్ పోరండ్ల సంతోష్ అధ్యక్షతన కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా దేశంలో, రాష్టంలో అందరికి, సామాజిక న్యాయం, విద్య,వైద్యం అందాలనే లక్ష్యంతో చేపట్టబోతున్న కుల జన గణన కార్యక్రమ అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిగా వచ్చిన పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కొయ్యాడ శ్రీనివాస్ మాట్లాడుతు కుల జన గణన కార్యక్రమం అనేది రాహుల్ గాంధీ సంకల్పం అని, ఇది చరిత్రలో నిలిచి పోయే ఓ మహొత్తర కార్యక్రమం అని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులకు, వార్డు ప్రజలకు దిశా నిర్దేశం చేసి,సర్వే అధికారులకు ఎలా సహకరిచాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఓబీసీ చైర్మన్ ఆలేటి రాజు,పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పోరండ్ల వేణు,మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ గడ్డం శివకుమార్, మీడియా ఇంచార్జి ధార్న వేణు,యూత్ కాంగ్రెస్ నాయకులు బాసాని సుమన్,కాంగ్రెస్ పార్టీ నాయకులు నామాల రాజన్న,ఆలేటి ప్రశాంత్, లడ్డు,సతీష్,కిరణ్,రాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉపాధ్యక్షుడికి ఘన సన్మానం

**ఖానాపూర్ నవంబర్ 05 (జనంసాక్షి)** పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన మండలంలోని బాదనకుర్తి పంచాయతీ కార్యదర్శి మేకర్తి సురేందర్ ను ఘనంగా సన్మానించారు. మంగళవారం మండల అభివృద్ధి కార్యాలయ ప్రాంగణంలో ప్రత్యేక అధికారి జీవరత్నం, ఎంపీడీవో సునీత, ఎంపీఓ రత్నాకర్ రావులు ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# పంట పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తల బృందం



**భూపాలపల్లి, నవంబర్ 5, (జనం సాక్షి)...** జిల్లాల్లోని వివిధ గ్రామాల్లో పర్యటించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్. బి. దిలీప్ కుమార్, డాక్టర్. యు. నాగభూషణం , డాక్టర్. ఆర్. విశ్వతేజ , జిల్లా వ్యవ సా య అధికారి శ విజయ్ భాస్కర్ వరి పొలా లను, ప్రత్తి చేనులను మరియు మిర్చి తోటలను సందర్శించారు. ప్రత్తిలో రసం పీల్చు పురుగుల అధికంగా ఉన్నట్లు గుర్తించి, వాటి నివారణకు డాఫెంతయిరాన్ అనే మందును 1.25 గ్రాములు లేదా అసిఫేట్ 1.5 గ్రా లీటర్ నీరు చొప్పున కలిపి పిచికారి చేసుకుకోవాలని సూచించారు. అలాగే ప్రస్తుతం మిర్చి తోటలో తామర పురుగు గమనించి వీటి నివారణకు ఫిప్రోనీల్ 2 ఎం.ఎల్ లేదా స్పినోసాడ్ 0.3 ఎం.ఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. అలాగే ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవి ద్యాలయ వరి నూతన చిరుసంచి వంగడాలను రైతు పొల్లాలో పరీక్షించి వాటి పనితనాన్ని పరిశీలించారు. ఈ పర్యటనలో మండల వ్యవసాయ అధికారులు వాసుదేవ రెడ్డి, ఐలయ్య, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# నాగులమ్మ జాతర మహోత్సవాలు ఘనంగా



**భూపాలపల్లి,నవంబర్5,(జనం సాక్షి )..**భూపాలపల్లి రూరల్ మండలం పంది పంపుల గ్రామంలో శ్రీ నాగు లమ్మ జాతర మహోత్సవాలు ఘనంగా జరిగాయి భారీగా తరలివ చ్చిన భక్తులు ఆలయ పూజారులు దామెర రమేష్ శ్రీవిద్య జాతరలో హోమం నిర్వహించారు అర్చకులు కాగితపు గణపేశ్వర చారుల ఆధ్వర్యంలో నాగులమ్మకు పూజలు చేయడం జరిగింది వివిధ గ్రామాల నుండి భక్తులు పెద్ద ఎత్తున నాగులమ్మకు మొక్కులు చెల్లించుకోవడం జరిగింది కోరిన కోరికలు తీర్చే 12 శిరుసుల నాగమ్మకు శివలింగానికి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు అనంతరం దామెర కిరణ్ ఇంటి వద్ద ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని భక్తులు పాల్గొని విజయవంతం చేశారు భక్తులందరికీ ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఎలుకటి సదానందం కార్యనిర్వాహక కమిటీ కార్యదర్శులు వావిలాల రాజేందర్ దామెర నరేష్ దామెర సురేష్ దామర శ్రీనివాస్ ఇటికాల సమ్మక్క బోధలు పోషక కేశవులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది..

# పతకాలతో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ స్కూల్

## కాసిపేట విద్యార్థుల ప్రభంజనం



**బెల్లంపల్లి, నవంబర్ 5, (జనంసాక్షి )**అండర్ 14, 17 ఎస్జిఎఫ్ఐ అథ్లెటిక్స్ బాలుర ఎంపిక పోటీల్లో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ స్కూల్ కాసిపేట విద్యార్థులు విజయ ప్రభంజనం సృష్టించారు. 21 పతకాలతో విజయ దుందుబి మోగించారు. ఈనెల 2న నవంబర్ 2024 చెన్నూర్ పట్టణంలో నిర్వహించిన ఎస్జిఎఫ్ఐ అండర్ 14, 17 అథ్లెటిక్స్ పోటిల్లో తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల కాసిపేట విద్యార్థులు పాల్గొని 17 మెడల్స్ సాధించారు. ఇందులో 7 గోల్డ్, 6 సిల్వర్, 4 బ్రోంజ్ పతకాలు సాధించారు. 8 మంది విద్యార్థులు జోనల్ లెవెల్ పోటీలకు ఎంపికయ్యారు. అండర్ 19 ఎస్జిఎఫ్ఐ అథ్లెటిక్స్ స్టేట్ లెవెల్ బాలుర ఎంపిక పోటీలు ఈనెల 4న ఎంజెపిబీసీ పాఠశాల లక్షెట్టిపేట లో నిర్వహించారు. ఈపోటిల్లో షార్ట్ పుట్ అండర్ 19 ఆదర్శ్, గోల్డ్ మెడల్ నిఖిల్ సిల్వర్ మెడల్స్ సాదించారు. 200 మీటర్స్ అండర్ 19లో కే శేఖర్ సిల్వర్ మెడల్, 400 మీటర్స్ అండర్ 19 తేజస్ బ్రోంజ్ మెడల్ సాదించారు. మొత్తంగా 21 మెడల్స్ సాధించి అద్భుత ఘనతను పాఠశాలకు అందించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్ అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంపొందించడానికి, ఆరోగ్యాన్ని మెరుగు పరచుకోవడానికి దోహదపడతాయి కావున ప్రతి ఒక్కరు క్రీడల పట్ల ఉత్సాహం చూపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రిన్సిపల్, జూనియర్ వైస్ ప్రిన్సిపల్ , ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు ఫిజికల్ డైరెక్టర్ హరీష్, పిఈటీ రాజేందర్ పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# రాష్ట్ర యోగ పోటీల పరిశీలకుడిగా ఇమ్రాన్

**ఖానాపూర్ నవంబర్ 05 (జనంసాక్షి)**స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుండి 8వ తేదీ వరకు వరంగల్ నగరంలో నిర్వహించనున్న యోగ రాష్ట్రస్థాయి పోటీల పరిశీలకుడిగా షేక్ ఇమ్రాన్ కు అవకాశం దక్కింది. మండలంలోని మస్కాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో పీడీగా విధులు నిర్వహిస్తున్న ఇమ్రాన్ రాష్ట్రస్థాయి యోగా పోటీల పరిశీలగుడిగా ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి

## రైతుబంధు జనగామ జిల్లా మాజీ అధ్యక్షులు ఇర్రి రమణారెడ్డి



**బచ్చన్నపేట ( జనం సాక్షి)**మాది ప్రజా ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం 70 శాతం వరి కోతలు అయిపోయిన ఇంతవరకు కొనుగోలు సరిగా లేకపోవడం వల్ల రైతులు ఇబ్బంది పడుతుంటే అది ప్రజా ప్రభుత్వం ఎలా అవుతుందని జనగామ జిల్లా రైతుబంధు మాజీ అధ్యక్షులు ఇర్రి రమణారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావస్తున్నా ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని ఇంతవరకు రైతుబంధు లేక రైతులను. హైడ్రా పేరుతో హైదరాబాదును ఆగం చేయడం. రెండు లక్షల ఉద్యోగులు ఇస్తామని నిరుద్యోగులను మోసం చేయడం. రియల్ ఎస్టేట్ జీరో కు పడిపోవడం వంటివి చూస్తుంటే ప్రభుత్వం దివాలా తీసిందని అర్థమవుతుందని అన్నారు. అంతేకాకుండా వరి పంట పండించడంలో తెలంగాణలోని జనగామ జిల్లా మొదటి స్థానం అని అందులో బచ్చన్నపేట మండలం అధికంగా పంటలు పండించే మండలమని ఇంతవరకు చెరువులు నింపిన దాఖలు లేవని ఎద్దేవ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి యాసంగికి నీరు అందించే విధంగా చెరువులు నింపాలని కోరారు. బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో పల్లెలను ఎంతో సుందరికంగా తీర్చిదిద్దిన సర్పంచులకు ఇంతవరకు బిల్లు ఇవ్వకపోవడం అడిగితే అరెస్టు చేయడం హేయమైన చర్య అని ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. సర్పంచులకు వెంటనే బిల్లులు ఇచ్చి వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బోడిగం చంద్రారెడ్డి. పిఏసిఎస్ చైర్మన్ పులిగిల్ల పూర్ణచందర్. మాజీ వైస్ ఎంపీపీ కల్లూరి అనిల్ రెడ్డి. మాజీ కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ షబ్బీర్. పట్టణ అధ్యక్షులు గంధమల నరేందర్.సీనియర్ నాయకులు ఈదులకంటి ప్రతాపరెడ్డి. పందిపల్లి సిద్ధిరామిరెడ్డి తదితరులు ఉన్నారు

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కుల గణన పై అవగాహన కార్యక్రమం



**పరకాల నవంబర్ 5 (జనం సాక్షి):**పరకాల శాసన సభ్యులు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశాల మేరకు పరకాల పట్టణంలోని 9వ డివిజన్ అధ్యక్షుడు 9వ వార్డ్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ కౌన్సిలర్ దార్న వేణుగోపాల్ అధ్యక్షతన కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా దేశంలో, రాష్టంలో అందరికి, సామాజిక న్యాయం, విద్య, వైద్యం అందాలనే లక్ష్యంతో చేపట్టబోతున్న కుల జన గణన కార్యక్రమ అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిగా వచ్చిన పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కొయ్యాడ శ్రీనివాస్ మాట్లాడుతు కుల జన గణన కార్యక్రమం అనేది రాహుల్ గాంధీ సంకల్పం అని, ఇది చరిత్రలో నిలిచి పోయే ఓ మహోత్తర కార్యక్రమం అని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులకు, వార్డు ప్రజలకు దిశా నిర్దేశం చేసి,సర్వే అధికారులకు ఎలా సహక రిచాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇర్ల చిన్ని,మరియు 9వ వార్డ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వెలదండి సురేష్,సుకనపల్లి ఉప్పలయ్య,మోతె సారంగా పాణి, పోశాల ప్రభాకర్,సామంతుల భిక్షపతి, మంత్రి శ్యామ్,సిలువేరు చిరంజీవి,మొలుగురి శ్రీనివాస్,గోరంటల వెంకట రాజం, సబ్బాని సమ్మయ్య,కె.శ్రీనివాస్,పి.రామకృష్ణ, ఓ.శ్రీకాంత్, దొగ్గేలా శ్రవణ్,సందీప్,రవీందర్, మార్క రజనీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# బ్యాండ్ యజమానుల నూతన కార్యవర్గం ఎన్నిక



**బెల్లంపల్లి, నవంబర్ 5, (జనంసాక్షి )**మంచిర్యాల జిల్లా బ్యాండ్ యజమానుల నూతన కార్యవర్గాన్ని మంగళ వారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా బందెల మురళి, ఉపాధ్య క్షునిగా సుధాకర్, ప్రధాన కార్య దర్శిగా ఎండీ తాజోద్దీన్, కోశాధికారిగా ఎండీ సర్వర్ మియా, సహాయ కార్యదర్శిగా శ్రీనివాస్, సాంస్కృతిక కార్యదర్శిగా రాజమౌళి, గౌరవ అధ్య క్షునిగా యశ్వంత్ రావు, సలహాదారులుగా పీర్ మహ్మద్, సలీమ్ లను ఎన్నుకున్నారు.

# సమగ్ర సర్వేపై ఉపాధ్యాయులకు శిక్షణ

**ఖానాపూర్ నవంబర్ 05 (జనంసాక్షి)**సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర సర్వేపై ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. మంగళవారం మండలాభివృద్ధి కార్యాలయ సమావేశ మందిరంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి జీవరత్నం విధివిధానాలపై అవగాహన కల్పించారు. సమగ్ర సర్వే నిర్వాహన పద్ధతులు, షెడ్యూల్డ్ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సునీత, మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్, ఎంపీఓ రత్నాకర్ రావు తో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.



# కరాటేలో రాణిస్తున్న తవక్కల్ విద్యార్థులు

**రామకృష్ణాపూర్,నవంబర్ 05 (జనంసాక్షి):** క్యాతన్ పల్లి మున్సిపాలిటీ లోని తవక్కల్ పాఠశాలలో గత 2 సంవత్సరాలుగా కరాటే లో అద్భుత ప్రదర్శన కనబర్చిన విద్యా ర్థులను తవక్కల్ విద్యా సంస్థల ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ మంగళవారం ఘనంగా సన్మానించారు. గత కొంత కాలంగా వివి ధ పోటీలలో అద్భుత ప్రదర్శన కనబరిచి రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి పోటీలకు సెలెక్ట్ అయిన విద్యార్థులు మాధురి, శ్రీహర్షిత, విష్ణుప్రియ, స్వస్థిక్, కృత్తిక, ధర్మతేజ, శ్రీ వైష్ణవి, సాయి అనన్య, శ్రీ నిత్య, అశ్విథ్, ఎల్కేజీ చదువుతున్న అన్నా ఈవెంజల్ లను తవక్కల్ విద్యా సంస్థల చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఘనంగా సన్మానించారు. ఆడవారిపై, చిన్న పిల్లల పైన జరుగుతున్న అఘా యిత్యాలను ఎదుర్కోవాలంటే పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు చదువుతో పాటు మార్షల్ ఆర్ట్స్, కరాటే లను నేర్పిం చాలన్నారు. అందుకే తమ పాఠశాలల్లో చదువుతో పాటు అన్ని రంగాల్లో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఇంత చక్కటి శిక్షణ ఇస్తున్న కరాటే మాస్టర్ జూల శ్రీనివాస్ సేవలను కొనియాడుతూ, ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యా యులు, విద్యార్తులు పాల్గొన్నారు.